ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 1 | పేజీలు: 25 | వెల: రూ.3/- | శుక్రవారం 24 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# రెండో రోజుకు చేరుకున్న ఆర్టీసీ సమ్మె



## 32 డిమాండ్లతో 21 అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగిన కార్మికులు

## బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

## హైదరాబాద్‌లో సర్వీసులు పెంచిన మెట్రో రైలు

## పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. 32 డిమాండ్లతో ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి. బస్సులు లేకపోవడంతో ప్రయాణాలు పెట్టుకున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సర్వీసులను పెంచింది. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సులను తీసుకుని నడుపుతోంది. హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్, జూబ్లీ బస్ స్టేషన్‌లలో డిపోల నుంచి బస్సులు బయటకు రాలేదు. బస్సులు డిపో నుంచి బయటకు రాకుండా కార్మికులు బైఠాయిస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయం తెలియక కొందరు ప్రయాణికులు బస్టాండ్లకు వచ్చి, విషయం తెలిసి వెనక్కి వెళుతున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన బస్సులు నడుస్తున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ గురువారం ఉదయం పెట్రోల్ పోసుకుని ..మిగతా 2లో

# 100 రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు!

## చెల్లింపుపై ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం

## ప్రణాళిక రూపకల్పన బాధ్యత మంత్రివర్గ ఉప సంఘానికి

## కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

## రూ.8 వేల కోట్లకు చేరిన బకాయిలతో ఇక్కట్లలో రిటైర్డ్ ఉద్యోగులు

## ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి అవసరమైన నిధుల సర్దుబాటు

## వచ్చే నెల 4న జరిగే తదుపరి కేబినెట్‌లో చెల్లింపులపై నిర్ణయం

## 'కాళేశ్వరం'పై విచారణ కోసం సీబీఐ డైరెక్టర్‌ను కలవనున్న సీఎం, ఉత్తమ్

## ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదన్న మంత్రి.. సుప్రీంకు వెళ్లాలా? కమిషన్ గడువు పెంచాలా? అనే దానిపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం




**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన రూ.8 వేల కోట్ల పైచిలుకు పదవీ విరమణ ప్రయోజనాలను వచ్చే 100 రోజుల్లోగా ఎలా చెల్లించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఈ బాధ్యతను అప్పగించింది. వచ్చే నెల 4న జరగనున్న తదుపరి మంత్రివర్గ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. గురువారం సచివాలయంలో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశమైంది. రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్లు, ఇన్ సర్వీస్ ఉద్యోగులకు మరో రూ.6,200 కోట్లు కలిపి మొత్తం రూ.14,200 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు నివేదించారు. దీంతో పాటు ఇతర అంశాలు చర్చించిన మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి..సహచర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి వివరాలు వెల్లడించారు.

'ఉమ్మడి ఏపీలో ఉద్యోగులు రిటైరైన కొన్ని నెలలకే పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించే వారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లు పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలను మిగిల్చిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది రిటైర్డ్ ఉద్యోగులకు బిల్లులు చెల్లించలేకపోయాం. కానీ ..మిగతా 2లో



## కాళేశ్వరం కేసులో సుప్రీంకోర్టుకు

# తెలంగాణ సర్కార్

## కేసీఆర్, హరీశ్ లపై చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు

## హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్న ప్రభుత్వం

## ఇప్పటికే పిటిషన్ సిద్ధం చేసినట్లు సమాచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు తదితరులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. హైకోర్టు తీర్పులోని లోపాలను ఎత్తిచూపుతూ, ప్రాజెక్టులో జరిగిన అసలు అవకతవకలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తి చేసి, పిటిషన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. విచారణలో నిబంధనలు పాటించలేదని, ముందస్తు నోటీసులు ఇవ్వలేదని అభిప్రాయపడుతూ హైకోర్టు.. కేసీఆర్, హరీశ్ రావు, స్మితా సబర్వాల్ వంటి వారికి ఊరటనిచ్చింది. అయితే, ప్రాజెక్టు వైఫల్యాలపై పూర్తి స్థాయి విచారణ జరగాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. సుప్రీంకోర్టులో ఈ కేసు ఎలాంటి మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

# బెంగాల్, తమిళనాడులో ముగిసిన పోలింగ్

## రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు

### సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్

### కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు

### 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు

### డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే), ..మిగతా 2లో

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో

# బీజేపీదే విజయం



## మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం విశేషం

## నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

**కోల్‌కతా ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న బెంగాల్ లో బిజెపి జెండాఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో ..మిగతా 2లో

# హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్షసూచన

2లో..

# 100 రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు!

**మొదటి పేజీ తరువాయి...**

గత 14 నెలలుగా ప్రతి నెలా రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్లను చెల్లించుకుంటూ వస్తున్నాం. అయితే రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసులు, సచివాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతుండటంపై మంత్రివర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే రెగ్యులర్ ఉద్యోగుల బకాయిలను సైతం సత్వరమే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలనే ఆలోచన చేసింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా బకాయిలను వెంటనే చెల్లించలేని పరిస్థితి ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సీఎం, మంత్రులతో పాటు ప్రజా ప్రతినిధుల జీతాల నుంచి 50 శాతం నిధులను కోత పెట్టి రిటైర్డ్ ఉద్యోగుల బిల్లుల చెల్లింపులకు వినియోగించాలని తీర్మానించింది. బకాయిల చెల్లింపులపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి సూచనలు చేయాలని వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘానికి కేబినెట్ సూచించింది..' అని పొంగులేటి తెలిపారు.

సీఎం రేవంత్‌తో పాటు త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకతలపై విచారణ చేపట్టాలని కోరతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలను ఇప్పటికే సీబీఐకు పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరి 9 నెలలు గడుస్తున్నా స్పందన లేదు. మళ్లీ త్వరలోనే ఈ నివేదికలను సీబీఐ డైరెక్టర్‌కు కూడా అందజేస్తాం..' అని అన్నారు. కేవలం బరాజ్‌లపై మాత్రమే విచారణ కోరుతున్నామంటూ మంత్రి ఓ ప్రశ్నకు బదులిచ్చారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సీబీఐ విచారణ చేస్తే చేయమనండి అని అన్నారు.

కాళేశ్వరంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై తాజాగా రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పు సారాంశాన్ని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి మంత్రివర్గానికి వివరించినట్టు ఉత్తమ్ తెలిపారు. ఘోష్ కమిషన్ నియామకాన్ని, కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పు బట్టలేదని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, ఎస్కే జోషి, స్మిత సబర్వాల్ తమ పిటిషన్లలో చేసిన ఆరోపణలతో న్యాయస్థానం ఏకీభవించలేదని చెప్పారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టంలోని సెక్షన్ 8బీ కింద పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే సాంకేతికపర అంశాన్నే తప్పు బట్టిందని, నివేదికలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే ఆదేశించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ కేసును వాదించిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో అడ్వకేట్ జనరల్ సమావేశమై హైకోర్టు తీర్పు నేపథ్యంలో తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణను ఖరారు చేస్తారని వెల్లడించారు. హైకోర్టు సూచించిన రీతిలో మళ్లీ సెక్షన్ 8బీ కింద నోటీసులు ఇచ్చిన విచారించడానికి వీలుగా ఘోష్ కమిషన్ గడువును పొడిగించాలా? లేక హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలా? అన్న అంశంపై న్యాయ నిపుణులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

-- పదవీ కాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు త్వరలో నామినేషన్ పద్ధతిన పాలకవర్గాలను నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

-- గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌ప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయం. స్టేడియం 76 ఎకరాల్లో విస్తరించి ఉండగా, రతన్ టాటా పేరుతో రూ.700 కోట్ల సీఎస్ఆర్ నిధులతో 64 ఎకరాల్లో స్టేడియం అభివృద్ధి బాధ్యతలను టాటా గ్రూప్‌కు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

-- మంథని నియోజకవర్గ ప్రాంత ప్రజల చిరకాల కోరిక చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు దాదాపు 2,427 ఎకరాల భూమి అవసరం. ఇప్పటివరకు 1,020 ఎకరాలు సేకరించారు. మిగిలిన భూసేకరణకు అవసరమయ్యే రూ.166.67 కోట్ల ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిదే విజయం

**మొదటి పేజీ తరువాయి...**

పాటు ఝాల్‌ముధ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముధ కొందరికి షాక కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచచ్చారు. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇపడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా ధ్రితీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

## హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో స్వాగత్ లాడ్జీ సమీపంలో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి కిందా ఈ నెల 12వ తేదీ గొల్ల వీరేంద్ర(34) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య తెలిపారు. గురువారం గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గద్వాల డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడిమెట్ల గ్రామానికి చెందిన గొల్ల వీరేంద్ర జీవనోపాధి కోసం గద్వాల పట్టణానికి వచ్చి ఖాళీ మందు సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయించి వచ్చిన డబ్బులతో జీవనం సాగించేవాడు. అదే విధంగా మహబూబ్ నగర్ కు చెందిన కుప్ప గిరి శ్రీనివాసులు, కడప జిల్లాకు చెందిన సిద్దయ్య ఇద్దరు కూడా ఖాళీ సీసాలు, చెత్తను సేకరించి విక్రయిస్తు జీవనం కొనసాగించేవారు. ఈ క్రమంలో గిరి శ్రీనివాసులు, సిద్దయ్య చెత్తసేకరించడం వల్ల తన ఆదాయం తగ్గుతుందని వీరేంద్ర వారితో తరచూ ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 11 రాత్రి ఓ వైన్ షాప్ వద్ద వీరేంద్ర గొడవపడి బూతులు తిట్టడంతో, కక్ష పెంచుకున్న నిందితులు పథకం వేశారు. ఈ క్రమంలో వీరేంద్రను హత్య చేయాలని ఇద్దరు నిందితులు పథకం రచించారు. ఈ నెల 12న ముగ్గురు కలిసి మద్యం సేవించేందుకు స్వాగత్ లాడ్జీ సమీపంలో గల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తున్న క్రమంలో వీరేంద్రతో నిందితులు ఘర్షణకు దిగి చేతులతో దాడి చేయగా వీరేంద్ర కింద పడిపోయాడు. అనంతరం అక్కడే ఉన్న పెద్ద రాయితో వీరేంద్ర ముఖం, తలపై దారుణంగా కొట్టడంతో వీరేంద్ర సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గద్వాల సీఐ టి.శ్రీను అక్కడి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. దారుణంగా హత్య చేయడంతో మృతదేహం ఎవరిది అని గుర్తుపట్టలేకపోయారు. మృతుడి కుడి చేతిపై ఉన్న 'అనిత' అనే పచ్చబొట్టు ఆధారంగా గద్వాల పోలీసులు ప్రాథమిక దర్యాప్తు మొదలుపెట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నిందితులైన కుప్ప గిరి శ్రీనివాసులు, సిద్దయ్యలను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో గద్వాల సీఐ టి.శ్రీను, ఎస్ఐ కళ్యాణ్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)**




విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో గురువారం పేరెంట్ టీచర్స్ మీటింగ్స్, విద్యార్థుల ప్రగతి నివేదిక కార్యక్రమాలను పురస్కరించుకొని ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఎవరిపై ఆధారపడకుండా జీవిస్తారని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా, వారికి వివిధ అంశాల్లో నైపుణ్యాలు పెరిగేలా తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయంలో చదివి ఇంటర్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. అనంతరం అధికారులు గురుకుల విద్యాలయంలోని విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో పుల్లూరు గ్రామ సర్పంచ్ సునీతమ్మ, ఉప సర్పంచ్ అబ్దుల్, డీసిఓ అనిలా కుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గద్వాల మున్సిపాలిటీలో హైడ్రామా...

### కమిషనర్ గైర్హాజరుపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల ధర్నా

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న నాలుగు కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ తీవ్ర ఉత్కంఠకు, వివాదానికి దారితీసింది. దరఖాస్తుల స్వీకరణకు గురువారం ఆఖరి రోజు కావడంతో ఆశావహులు, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు భారీగా తరలివచ్చారు. అయితే, అత్యంత కీలకమైన సమయంలో మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కో-ఆప్షన్ దరఖాస్తులను స్వయంగా కమిషనర్‌కే అందజేయాలని కౌన్సిలర్లు భావించగా, ఆయన కార్యాలయంలో లేకపోవడంతో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు గద్వాల్ కమిషనర్ ను చరవాణి ద్వారా సంప్రదించగా, "దరఖాస్తులను ఇన్-వార్డు సెక్షన్‌లో ఇచ్చి వెళ్ళండి" అంటూ బదులివ్వడం వివాదానికి ఆజ్యం పోసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, దరఖాస్తుల గడువు ముగిసే సమయంలో కార్యాలయానికి రాకుండా ఇలా సమాధానం చెప్పడంపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు,నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. కమిషనర్ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి నిరసన చేపట్టారు. కమిషనర్ ఛాంబర్ వద్ద బైఠాయించిన కౌన్సిలర్లు ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార పార్టీ ఒత్తిడితోనే కమిషనర్ ఇలా వ్యవహరిస్తున్నారని, పారదర్శకత లేకుండా ఇన్-వార్డులో దరఖాస్తులు వేయమనడం వెనుక కుట్ర దాగి ఉందని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న గద్వాల మున్సిపల్ కమీషనర్ కార్యాలయానికి రాగ, దరఖాస్తు చేసుకోవడాని ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, దరఖాస్తు చేసుకునే వారు అప్లికేషన్ ఫామ్స్ ను ప్రత్యేక సెల్ లో సమర్పించాలని సూచించారు.

## చిన్న, మధ్య తరహా పత్రికల అసోసియేషన్ ప్రతినిధి అశోక్‌కు రాష్ట్ర అక్రిడేషన్ కమిటీలో స్థానం

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర చిన్న, మధ్య తరహా దినపత్రికల అసోసియేషన్ కు రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీలో మన అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్ కి స్థానం కల్పించారు. చాలా మంచి నిర్ణయం. దీనికి సహకరించిన టీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారు కె. శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఖాజా విరహత్ అలీ కి, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ కి, అవకాశం కల్పించిన సమాచార పౌరసంబంధాల శాఖ రాష్ట్ర కమిషనర్ సీహెచ్. ప్రియాంక , చిన్న, మధ్య తరహా దినపత్రికల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు కి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు .





## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్షసూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీవ్రమైన ఎండ ఉండగా.. ప్రస్తుతం ఆకాశం మేఘావృతమైంది. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో రానున్న 2-3 గంటల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని తెలిపింది.

## రెండో రోజుకు చేరుకున్న ఆర్టీసీ సమ్మె

**మొదటి పేజీ తరువాయి...**

నిప్పంటించుకోగా.. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచిం చారు. ఈ క్రమంలో శంకర్‌ను వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. దారి మధ్యలోనే మరణించినట్లు తెలుస్తోంది. దాదాపు 80 శాతం కాలిన గాయాలు ఉండటంతో శంకర్ గౌడ్ మరణించినట్లు సమాచా రం.

## బెంగాల్, తమిళనాడులో ముగిసిన పోలింగ్

**మొదటి పేజీ తరువాయి...**

తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు.అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## ప్రజల నీటి డిమాండ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి..!

### అధికారులకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)**

వనరులు మితంగా ఉన్నాయి.. నీటిని పొదుపుగా వాడాలని ప్రజలకు విజ్ఞప్తితాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. జలమండలి పరిధిలోని పలు వాటర్ ఫిల్లింగ్ స్టేషన్స్ ను ఎండీ బుధవారం సందర్శించారు. కొండాపూర్, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, బంజారాహిల్స్, సోమాజిగూడ ఫిల్లింగ్ స్టేషన్ లలో బుకింగ్ అధిగంగా ఉండడంతో అధికారులు 24 మానిటర్ చేయలని అధికారులను ఆదేశించారు. పెండెన్సీ లేకుండా రెండు షిఫ్ట్ లలో ట్యాంకర్ డెలివరీ చేసేవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే కోకాపేటలోని బృందావన్ కాలనీలో కొత్త ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను జలమండలి అశోక్ రెడ్డి ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా ట్యాంకర్ బుకింగ్స్ పెరగడంతో, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ మీద దృష్టి సారించింది. మణికొండ, నార్సింగి పరిసర పరిధిలో పెరుగుతున్న తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు వేగంగా తాగు నీటిని అందించే విధంగా ట్యాంకర్ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... వేసవిలో వచ్చే నీటి డిమాండ్ ను ఎదుర్కోవడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే డెలివరీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏమైనా అవసరాలుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ట్యాంకర్ బుకింగ్ లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎండీ హెచ్చరించారు. ప్రతి ట్యాంకర్ టోకెన్ పై బార్ కోడ్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల ప్రతి ట్రిప్పుల లెక్కలు పక్కాగా ఉంటాయన్నారు. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎండీ తెలిపారు. ఇవి ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానమై ఉంటాయన్నారు. దీని వల్ల ప్రతి కదలికను పర్యవేక్షిస్తున్నట్లు గుర్తు చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరులు మితంగా లభిస్తున్నప్పటికీ, అవసరాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, ప్రజలందరూ నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని కోరారు. గృహ అవసరాలు, వాణిజ్య వినియోగం, ఇతర అవసరాల కోసం నీటి వినియోగం పెరుగుతున్న దృష్ట్యా, ప్రతి చుక్క నీరు విలువైనదిగా భావించి దుర్వినియోగాన్ని పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని అన్నారు.అలాగే భూగర్భ అడుగంటిపోతున్న నేపథ్యంలో రానున్న 30 రోజులలో నీటి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ప్రజల సహకారం లేకుండా ఈ పరిస్థితిని ఎదుర్కోవడం సాధ్యం కాదని అయన స్పష్టం చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరూ నీటి పొదుపు పాటించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



నీటి ఫిల్లింగ్ స్టేషన్ ను పరిశీలిస్తున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి

**ట్యాంకర్ బుకింగ్ విధానం (శాతాల్లో):**

వినియోగదారులు వివిధ మార్గాల ద్వారా ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారు. అందులో మొబైల్ యాప్ ద్వారా 46. ఐవీఆర్ఎస్ (కస్టమర్ కేర్) - 47, జలమండలి అధికారిక వెబ్ సైట్ ద్వారా 7 శాతం మంది ట్యాంకర్లు బుక్ చేసుకున్నారు.

# భగీరథ మహర్షిని స్మరించుకోవడం మనందరి బాధ్యత..

### ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**రాజేంద్రనగర్,ఏప్రిల్23(ప్రభాత ఉదయం)**

కఠోరమైన దీక్షతో దివి నుంచి భువికి గంగను రప్పించిన మహనీయుడు శ్రీభగీరథ మహర్షి అని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కొనియాడారు.గురువారం సగర కుల గురువు భగీరథ మహర్షి జయంతి వేడుకలను సగర ఉప్పర సంఘం నాయకులు బల్గూరి శ్రీనివాస్ సాగర్ ఆధ్వర్యంలో మైలార్ దేవులపల్లి డివిజన్ లోని శివాజీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...భగీరథ మహర్షిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు జీవితంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు.భగీరథుడి వారసులైన ఉప్పర కులానికి చెందిన వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు.బీసీ కార్పొరేషన్ ద్వారా వారికి రుణాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు.పూర్వ పితామహులకు స్వర్గప్రాప్తి కల్పించడానికి దివి నుంచి గంగను భూమిపైకి వచ్చేలా చేశారని భగీరథ మహర్షిని కొనియాడారు.ఈ సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు.మహర్షి భగీరథ



భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

నిశ్చల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన వ్యక్తిత్వం,ప్రతి పౌరునికీ స్ఫూర్తిదాయకం.లక్ష్యం పట్ల అంకితభావం,పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని, భగీరథుని జీవితం యువతకు గొప్ప సందేశమని తెలిపారు.ఎవరైనా కష్ట పట్టుదలతో అనుకున్నది సాధిస్తే..వారిని భగీరథునితో పోలుస్తారన్నారు.సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు.

**భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం..సగర ఉప్పర సంఘం నాయకులు బల్గూరి శ్రీనివాస్ సాగర్**

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకమని సగర ఉప్పర సంఘం నాయకులు బల్గూరి శ్రీనివాస్ సాగర్ అన్నారు.ప్రభుత్వం సగరులకు రాజకీయ రంగంలో అవకాశాలు కల్పించాలని కోరారు.ఆర్థికంగా సామాజికంగా తోడ్పాటును అందించాలని డిమాండ్ చేశారు.సగరుల సమస్యల పరిష్కారం,హక్కుల సాధనకు చైతన్యంగా ముందుకెళ్లాలన్నారు. కఠోర శ్రమ చేసి దేనినైనా సాధించగలమని భగీరథ మహర్షి నిరూపించారని,ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని సగర యువత లక్ష్యాలను సాధించాలని సూచించారు.భగీరథుడి స్ఫూర్తితో సగరులు అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. సగరుల కృల వృత్తి అయిన గృహాలు నిర్మించడంలో అధిక శాతం పనులు,కాంట్రాక్టర్లుగా సగరులకే అవకాశం కల్పించాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సగరులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బల్గూరి శ్రీనివాస్ సాగర్ కోరారు.లేబర్ కార్డుల జారీపై అధికారులతో సగరులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు.భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో మైలార్ దేవులపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్,సగర సంఘం నాయకులు,సగరులు ఆర్కతల రవీందర్ సాగర్,బాల్ రాజ్ సాగర్,మహేష్ సాగర్,ప్రసాద్,నరేష్ సగర,గోపాల్ నగర,భాస్కర్ సగర,గోపి సగర,రవి సగర,రాజు సగర,కొండలు సగర,కిరణ్ సగర,దేవేందర్ సగర,విక్రమ్ సగర,ఓంకార్ సగర,శ్రీకాంత్ సగర,సగర బంధువలు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి కేంద్రాలలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలి

### కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్,ఏప్రిల్23(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బాబుల్ రెడ్డినగర్ 2అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిల్లలకు సంబంధించి పాఠశాల సంసిద్ధత మేళా,గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం,తల్లుల సమక్షంలో పిల్లల అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ ముఖ్యఅతిథిగా కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేష్ కు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు.అంగన్వాడి సిబ్బంది తదుపరి వెంకటేష్ చిన్నపిల్లలకు,వారి తల్లిదండ్రుల సమక్షంలో తేనీటి పాయసం తినిపించారు.అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ...అంగన్వాడి ద్వారా గర్భిణీ స్త్రీలకు,పిల్లలకు సరైన పోషకాహారాలు అందించాలని ఏదైనా అవసరమైన వేళ తన సహకారం ఉంటుందని వెంకటేష్ తెలిపారు.అదేవిధంగా ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన సిబ్బందిని అభినందించారు.చిన్నారులు సంతోషంగా పౌష్టికాహారాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్ గుప్తా,యాదగిరి,భాస్కర్,మల్లేష్ నేత,సురేష్,దుర్గ ప్రసాద్,ఆకుల శ్రీను,రాయుడు,పూజారి రవి,ఎడ్యుకేషన్ మాస్టర్ ట్రైనర్ హిమబిందు,అంగన్వాడీ టీచర్స్ అనిత,మాధవి,లక్ష్మీ,రత్న,భానుప్రియ,సంగీత,వరలక్ష్మి,గర్భిణీ మహిళలు,బాలింతలు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**



హేమ సుదర్శన్ జిల్లోజు

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల కు ఆమె మద్దతు ప్రకటించారు. అవసరమైతే ఆర్టీసీ కార్మికుల సమస్యల సాధన కోసం నిరాహార దీక్షలకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు . ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు మేలు చేస్తామని వారి డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వారి హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు . ఆర్టీసీ కార్మికులకు రావలసిన పిఆర్ సీ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు . ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయుధ వేయాలి

### తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం) :**



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ

ఆర్టీసీ సమ్మె కారణంగా బస్సులో రవాణా లేకపోవడంతో విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరు అవ్వలేక పోతున్నారని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ అన్నారు. విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు . ఈ నేపథ్యంలో తక్షణమే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలన్నారు. ప్రభుత్వం ఆలోచించి విద్యార్థులకు ఇబ్బందులు కలుగ కుండ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు హరీష్, ప్రవీణ్, రాజేష్ , జగదీష్, వినోద్ , వంశీ తదితరులు పాల్గొన్నారు



## బిజెపి మహిళ అగ్రహ అక్రోష్ యాత్రకు భారీగా తరలిన రాజేంద్రనగర్ బిజెపి నాయకులు, నాయకురాళ్లు

**రాజేంద్రనగర్,ఏప్రిల్23(ప్రభాత ఉదయం)**




భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర పార్టీ నిర్వహించి అగ్రహ అక్రోష్ యాత్ర కార్యక్రమంలో దోమలగూడ ఏవీ కాలేజీ నుండి ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు,మహిళా నాయకురాలు, గోల్కొండ గోషామహాల్ జిల్లా ఇంచార్జ్ వై.శ్రీధర్ పాల్గొన్నారు.పార్లమెంట్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ రిజర్వేషన్ బిల్లు భారతీయ జనతా పార్టీ పెట్టినటువంటి బిల్లుకు కాంగ్రెస్ యూపీఏ పార్టీలు మహిళలకు రిజర్వేషన్ రాకుండా అడ్డుకోవడం రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తూ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నుండి పెద్ద ఎత్తున హాజరు అయ్యారు.




బిజెపి తలపెట్టిన మహిళ ఆక్రోస్ కు మహిళలతో కలిసి కిస్మత్పూర్ నుండి వెళ్లిన రాష్ట్ర నాయకురాలు అన్నపురెడ్డి స్వర్ణలత రెడ్డి

## మహిళా బిల్లును అడ్డుకుంటే ప్రతిపక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారు

### బిజెపి రాష్ట్ర నాయకురాలు అన్నపురెడ్డి స్వర్ణలతారెడ్డి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని కృతనిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం 33% రిజర్వేషన్ కోసం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బిల్లును ప్రవేశపెడితే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, అడ్డుకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని బిజెపి రాష్ట్ర నాయకురాలు అన్నపురెడ్డి స్వర్ణలతారెడ్డి హెచ్చరించారు. గురువారం బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో పార్లమెంట్లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షాల వ్యవహరించిన తీరుపట్ల

బిజెపి రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు జిహెచ్ఎంసి మెయిన్ ఆఫీస్ నుండి ఇంద్ర పార్క్ వరకు చేపట్టిన పాదయాత్ర కార్యక్రమంలో స్వర్ణలత రెడ్డి భారీ సంఖ్యలో మహిళలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణలతారెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళలకు సమాజంలో సమున్నత స్థానం కల్పించాలని మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టిందన్నారు. చట్టసభల్లో మహిళలకు సమిచిత స్థానం కల్పిస్తే నీతివంతమైన పాలన కొనసాగి దేశం ప్రగతి పథంలో ముందుకు వెళుతుందని ఆమె పేర్కొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న స్వర్ణలత రెడ్డి



## హార్టికల్చర్ సీట్ల కేటాయింపుపై నిరసన

**రాజేంద్రనగర్,ఏప్రిల్23(ప్రభాత ఉదయం)**

శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీలో పీజీ,పీహెచ్డీ విద్యార్థులు హార్టికల్చర్ సీట్ల కేటాయింపుపై నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు.ఈ అంశం ఇటీవల వార్తాపత్రికల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.వచ్చే విద్యా సంవత్సరంనుంచి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 30బీఎస్సీ హార్టికల్చర్ సీట్లు,8 ఎంఎస్సీ సీట్లు కేటాయించనున్నట్లు వచ్చిన సమాచారంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.హార్టికల్చర్ కోర్సులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఉండగా,మరో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇదే కోర్సులకు సీట్లు కేటాయించడం సరైన నిర్ణయం కాదని వారు పేర్కొన్నారు.ఈ చర్య వల్ల హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రాముఖ్యత దెబ్బతింటుందని, విద్యార్థుల అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ధర్నా చేపట్టారు.వారం రోజుల్లోగా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు.హార్టికల్చర్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సీరియస్గా పరిగణించి,వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సముచిత నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## అరుణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,ఏప్రిల్23(ప్రభాత ఉదయం)**

బుద్వేల్ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు అరుణరెడ్డి పెద్ద కుమారుడు నాలుగు రోజుల క్రితం మరణించడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి స్పందించారు.ఆయన వారి నివాసంకు చేరుకొని వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనో ధైర్యాన్ని ఇవ్వాలని,వీరి కుటుంబానికి భరోసా కల్పించారు.అరుణ రెడ్డిని కలిసిన వారిలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు గుమ్మడి కుమార్,యూత్ అధ్యక్షులు రఘు యాదవ్,మహేష్ రెడ్డి,ప్రవీణ్,క్రాంతి,నరేష్,శేఖర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ ఐ ఆర్ పూర్తిచేసిన పత్రాలను మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్ కు అందజేస్తున్న ప్రజలు

## ఓటర్ లిస్టులో పేర్లు సరి చేసుకోవాలి

### మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్

### శాస్త్రీపురంలో ఎం ఐ ఎం ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)**

భారత్ ఎన్నికల సంఘం తీసుకొచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ఎంఐఎం నాయకులు నిర్వహించారు. గురువారం శాస్త్రి పురం డివిజన్ పరిధిలోని సీఎస్ కె కాలనీలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ హబీబ్ జాయిన్ ఆరిఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఓటర్ జాబితాలో సవరణ దరఖాస్తులు పూర్తిచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్ మాట్లాడుతూ... ప్రజలు ఓటర్ లిస్టులో తమ పేర్లలో తప్పిదాలు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రి పురం వార్డ్ మాజీ ఎంఐఎం కౌన్సిలర్ మహ్మద్ షరీఫ్, పార్టీ నాయకులు అంజద్ ఖాన్, మహమ్మద్ అర్బజ్, మహమ్మద్ సోయల్, మహమ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.




సన్మానం చేస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

## దళిత యువరత్న అవార్డు గ్రహీత సల్ల మహేష్ను సన్మానించిన అమ్మ ఫౌండేషన్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించిన అంబేద్కర్ ఉత్సవాలలో జనగామ పట్టణానికి చెందిన సల్ల మహేష్ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధికి దళిత యువ రత్న అవార్డు వచ్చిన సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ ఆధ్వర్యంలో అమ్మ ఫౌండేషన్ ఆఫీస్ లో గురువారం శాలువాతో సన్మానం చేశారు. నల్ల మహేష్ అన్నదానం, వస్త్ర దానం, బియ్యం, కూరగాయల పంపిణీ కరోనా కష్ట కాలంలో తను చేసిన సేవలను ఈసందర్భంగా కొనియాడారు ఈ కార్యక్రమంలో గట్టుపల్లి బాలస్వామి, జంగిటి నర్సింగరావు, పింజరి సతీష్ , శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు



## వనిత టీ స్టాల్ విజయ మిల్క్ డైరీ పార్లర్ కంటైనర్ డబ్బాల తొలగింపుపై ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ కు వినతిపత్రం అందచేసిన కౌన్సిలర్స్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):**

జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన సముదాయ గోడ ప్రక్కన ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి "వనిత టీ స్టాల్ విజయ మిల్క్ డైరీ పార్లర్" కంటైనర్ డబ్బాల తొలగింపు విషయంపై చర్చించడం కోసం ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ కి మూడో వార్డు సిపిఎం కౌన్సిలర్ బూడిద జ్యోతి 13వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ పానుగంటి సువార్త వినతిపత్రం అందచేశారు.



## కాళేశ్వరం అంశంపై కోర్టు తీర్పు నేపథ్యంలో హరీష్ రావును కలిసిన బిఆర్ఎస్ నేతలు

**పటాన్‌చెరు, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):**

కాళేశ్వరం అంశంపై కోర్టు తీర్పు నేపథ్యంలో పటాన్ చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకుల తో కలిసి జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి మాజీ మంత్రి,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆయనను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై వచ్చిన తీర్పు నిజానికి న్యాయం జరిగిందని, రాజకీయ కక్షసాధింపులకు ఇది గట్టి సమాధానమని పేర్కొన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎల్లప్పుడూ నిలుస్తుందని, ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని, ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలని కోరారు. అలాగే ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, జిన్నారం రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ , బొల్లారం మాజీ కౌన్సిలర్ టి.సాయికిరణ్ రెడ్డి,మధు తదితరులు పాల్గొన్నారు.



## భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**కొత్తకోట ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని సాగర యువజన సంఘం అధ్యక్షులు ఎస్పీ సురేష్ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దివి నుండి భూమికి గంగానదిని తీసుకువచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి ని స్మరించుకున్నారు. భగీరథ మహర్షి సేవలను కొనియాడుతూ ఆయన ఆచరణీయ జీవితాన్ని యువత అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నరేంద్ర సాగర్, కురుమూర్తి , వినోద్ సాగర్, సి. కురుమూర్తి , శ్రీను సాగర్, భాస్కర్ , అరుణ్ , సి. నాగన్న , వినోద్ కుమార్, రాజు, బుచ్చన్న , జనార్దన్ , పెద్ద వెంకటయ్య, రవి సాగర్, రాజా బాబు, కృష్ణ సాగర్, రాములు , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)**



రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందినట్లు కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కొండాపురం గ్రామానికి చెందిన కొండన్న, భార్య శకుంతల(24) ఇద్దరు కలిసి బుధవారం సాయంత్రం తమ పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. వంట కోసం శకుంతల తన తలపై కట్టెల మోపు పెట్టుకుని బైక్ వెనుక కూర్చున్నారు. మార్గమధ్యలో కొండాపూర్ స్టేజ్ సమీపానికి చేరుకోగానే, ఆమె తలపై ఉన్న కట్టెల మోపు రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మలకు బలంగా తగిలింది. దీంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి శకుంతల ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర రక్తగాయమైంది. వెంటనే ఆమెను చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి నర్సింహులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఈ ఈ వెంకట శేషయ్య ను కలసిన బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య తదితరులు

## ఎర్రబోడ, గగన్ పహాడ్ బస్తీలలో అభివృద్ధి పనులు చేపట్టాలి

**బీ ఆర్ ఎస్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని ఎర్రబోడ, గగన్ పహాడ్ బస్తీ లలో అభివృద్ధి పనులు, శ్మశాన వాటికలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య లు కోరారు. ఈ మేరకు వారు రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు, ఈ ఈ లను కలసి మాట్లాడారు. ఉప్పర్ పల్లి,ఎర్రబోడ,గగనపహాడ్ బస్తీ లలో ఉన్న శ్మశానవాటికలకు కొన్ని రోజులకు ముందు మంజూరు అయిన నిధులతో పనులు చేపట్టాలన్నారు. ఆయా ప్రాంతాల్లో మంజూరు అయిన రోడ్డు పనులు ఇప్పటి వరకు టెండర్ పూర్తి చేయలేదని ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. స్పందించిన అధికారులు త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారని పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరికొండ దుర్గేష్, గిరి బాబు, నగేష్, ఉదయ్ గౌడ్, కట్టెలమండి గౌతమ్, విజయ్, రవి, హనుమాన్, ఈశ్వరయ్య, అజయ్, శ్రీనివాస్, లక్కీ,నీరజ్ తదితరులు పాల్గొన్నారు



బాబుల్ రెడ్డి నగర్ అంగన్వాడీ కేంద్రం లో జరిగిన అన్న ప్రాసనం, గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, తదితరులు

## బాల్యం నుంచే చిన్నారులకు చదువు పట్ల ఆసక్తిని పెంచాలి

**కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

బాల్య దశ నుంచి చిన్నారులకు చదువు పట్ల ఆసక్తిని పెంచాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా అన్నారు అత్తాపూర్ సర్కిల్ బాబుల్ రెడ్డి నగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం జరిగిన అన్న ప్రాసనం, గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొని చిన్నారులను అభినందించారు. గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చదువు మనిషిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతుందని, చదువు ద్వారానే ప్రగతి సాధ్యమని, ఆ చదువును చిన్నారులకు బాల్యదశ నుంచే ఇష్టంగా చదువుకునేటట్లు చేయాల్సిన బాధ్యత అంగన్వాడీ కేంద్రాలపైనే ఉందన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాలను ప్రోత్సహిస్తూ, సహకారం అందజేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, రవి నాయుడు, ఆకుల శ్రీనివాస్ తోపాటు అంగన్వాడి టీచర్లు , ఆయాలు పాల్గొన్నారు




పిర్యాదు చేస్తున్న నాయకులు

## జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**జనగామజిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తమకు సంబంధించిన వనిత టీ స్టాల్, విజయ మిల్క్ పార్లర్ డైరీ లను కంటైనర్లను కలెక్టర్ ఆఫీస్ గోడ మూల వద్ద ఉన్నవాటిని మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకూ ఎవరు లేని సమయంలో అరాచకంగా అక్రమంగా కంటైనర్ డబ్బాలను ను తీసుకువెళ్లి ఎక్కడ వేశారు.తెలవదని హైకోర్టు ఉత్తర్వులు అమలులో ఉండంగా మాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు స్థలాలు చూపించకుండా డబ్బాలను ఎత్తుకెళ్లడం వల్ల ఒక్కొక్కరివి నాలుగు లక్షల విలువ చేసేవి, అలాగే నగదు కూడా పోయిందని తక్షణం వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధిత మహిళలు పాలమాకుల చిన్న మంజుల, పుత్కనూరి విజయలక్ష్మి జనగామ పోలీస్ స్టేషన్లో ఎస్సై రితీష్ కి ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో వారి వెంట కరెన్సీ నోట్ పై అంబేద్కర్ ప్రతిమ ముద్రణ సాధన జాతీయ సలహాదారు మల్లిగారి రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, బాధితురాలి భర్త పాలమాకుల కనకయ్య పాల్గొన్నారు.



## ఘనంగా రేణుక ఎల్లమ్మ, పోచమ్మ తల్లి దేవాలయం గర్భగుడి భూమి పూజ

**పాల్గొని పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పిజేఆర్ నగర్ లోని శ్రీశ్రీశ్రీ రేణుకఎల్లమ్మ, పోచమ్మ తల్లి దేవాలయం గర్భగుడి భూమిపూజ కార్యమం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కొరకు తనవంతు సహాయం చేయడం జరిగిందని, ఆలయ అభివృద్ధి నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, దాతలు ఎవరైనా ఉంటే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించి వారికి తోచిన సహాయమందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, ఆనంద్, భాలస్వామి, అగ్రవాసు, సంగమేష్, కార్తీక్, రవీందర్, సుధాకర్, ఫాండు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి వైపు మరో అడుగు... పాపిరెడ్డి నగర్‌కు కొత్త రూపు!

**పాపిరెడ్డి నగర్‌లో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నేడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి శంకుస్థాపన**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని వెంకటేశ్వరనగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్‌లో అభివృద్ధి పనులు మరింత వేగం అందుకుంటున్నాయి. రోడ్ నంబర్ 1, రోడ్ నంబర్ 2, బి-బ్లాక్ ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నేడు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని స్థానిక నాయకుడు శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు కూడా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయ్యాక ఈ రెండు రోడ్లపై సీసు రోడ్లు నిర్మించినట్లయితే, పాపిరెడ్డి నగర్‌లో దాదాపు 99% అభివృద్ధి పనులు పూర్తయినట్టేనని, ఈ ఘనత అరికెపూడి గాంధీ కే దక్కుతుందని తెలిపారు. ఇలాంటి అభివృద్ధి దృష్టి కలిగిన నాయకుడు తమ ప్రాంతానికి దొరకడం ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. నేడు ఉదయం 9:30కు పాపిరెడ్డి నగర్, రోడ్ నం.1 ఌ 2, బి-బ్లాక్ పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**పటాన్ చెరు, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):**

గ్రాడ్యుయేషన్ డే అనేది ఒక వేడుక కాదని జ్ఞానం సాధించిన ప్రయాణంలో ఒక మైలురాయి వంటిది అని గీతాంజలి రోబోటిక్ పాఠశాల నిర్వాహకులు కృష్ణ కిషోర్ పేర్కొన్నారు. ఇస్నాపూర్ గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో యుకెజీ,ఐదవ తరగతి విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ప్రాథమిక విద్య లోకి, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య లోకి ప్రవేశించే విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా విజయ భావన పెంపొందించడం ప్రధాన ఉద్దేశం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరి రేగొండ చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉన్నత తరగతి పట్టాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రియదర్శిని, దివ్య, శిరీష, నాగరాణి, కల్పన,మాధవి లక్ష్మి, కృష్ణ వేణి సహాయకులు ప్రభాకర్, స్వప్న దుర్గా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608